# స్త్రీ

నేను నీట్‌గా డ్రస్ చేసుకుని బయలుదేరాను. గుంటూరులో సాహిత్యసభ. అక్కడ నేను మాట్లాడాలి. ఫలానా వారి సాహిత్యంలో స్త్రీ అంటూ మొదలుపెట్టి ఎలా మాట్లాడాలో నాలో నేనే మననం చేసుకుంటున్నాను. కాగితం మీద విషయాలు రాసుకునే తీరిక లేక పోవడంతో మరీ ఆందోళనగా వుంది మనసులో. విజయవాడ, గుంటూర్ల మధ్య ప్రయాణం ఒక పెద్ద ప్రయాణంగా ఎవరూ అనుకోరు. అందుకే నేను తిన్నగా సభావేదిక మీదకి వెళ్ళిపోయేలా తయారై బయలుదేరాను. ముందు రోజు నుంచి యింట్లో నసగానే వుంది.

"నువ్వు కారు పంపిస్తే గాని రానని చెప్పాల్సింది" అని. నిజమే గానీ, ఆ కార్యకర్తలు నాకు బాగా తెలిసున్న మిత్రులు కావడంవల్ల, వారికున్న ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ముందుగానే నాకు చెప్పి వుండడం వల్లనే నెక్కువగా పట్టించుకోలేక పోయాను. పైగా వారు పది రోజుల్లో మూడు వుత్తరాలు రాశారు.

"ఏమాత్రం అవకాశం వున్నా కారు పంపుతాము. ఒకవేళ పంపలేకపోతే మా అశక్తతని మన్నించి మీరే వచ్చేయండి" అని వుత్తరాల సారాంశం. నాకూ అనిపించింది. ఈ రోజుల్లో ఎంతో శ్రమకి ఓరిస్తే గానీ యిలాంటి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించటం కష్టం. అదొక రకమైన వ్యసనం. లేకపోతే బలహీనత అంతమంది రచయితలు, రచయిత్రులు వేదిక మీద కలకల్లాడుతూ కనిపిస్తే కొందరి కెంతో ఆనందం. నేను 'నాన్‌స్టాప్' బస్సు ఎక్కి కూర్చున్నాను. నునువెచ్చగా అప్పుడే ఎండ పరచుకుంటోంది. కిటికీ పక్క సీట్లో కూర్చున్నాను. మనసు ఆహ్లాదంగా వుంది. నేను

ఉపన్యాసం ఎలా మొదలుపెట్టాలో - ఏమేమి ఉదహరించాలో - మధ్యలో ఛలోక్తులు విసరటానికి ఎలా అవకాశం కల్పించుకోవాలో పథకాలు వేసుకుంటున్నాను.

ఇంతలో ఒకామె వచ్చి నా పక్క సీట్లో కూర్చుంది. సన్నగా, నల్లగా, గడకర్రకి చీర కట్టినట్లుంది. నల్లని శరీరం తెలతెల్లని పొడలతో కుంపట్లో నీళ్ళోసి ఆర్పేసిన బొగ్గులా వుంది. గుడ్డలు మురికిగా, జుట్టు రేగి, చూడడానికి చిరాకు కలిగించేలా వుంది. ముఖం కడగలేదు, కళ్ళు వికారంగా వున్నాయి. చేతుల్లో మాసిన బట్టల పొత్తిళ్ళలో ఎముకల పోగులాంటి చంటిపిల్ల.

నాకెలాగో అనిపించింది. అలసీమె ఈ బస్సెలాగెక్కింది అని చిరాకేసింది- చిత్రంగా నా కంతవరకు వున్న ఉత్సాహం మీటనొక్కినట్లు ఆరిపోయింది.

"ఏమ్మాయ్! టిక్కెట్టు తీసుకున్నావా" అన్నాను. ఆ ప్రశ్నలో ఎంతో ఆశ ఉంది. టిక్కెట్లు బస్సులో యివ్వరు. కౌంటర్‌లో యిస్తారు. ఆ మాత్రం తెలిసే అవకాశం ఆ మనిషికి లేదని నా దురాశ. ఆమె దిగిపోవాలని నా కోరిక.

ఆమె నిశ్శబ్దంగా మూసిన గుప్పిట నెమ్మదిగా విప్పి చూపించింది. టిక్కెట్టు వుంది. దాని మీద సీటు నెంబరు కూడా వుంది.

నేను ఓటమిని అంగీకరించలేక కిటికీలోంచి తల బైటకి పెట్టాను. మళ్ళీ నా ఉపన్యాసం గురించి ఆలోచన మొదలుపెట్టానుగానీ, ముందుకు సాగలేదు. బస్సు కదిలితే బాగుండుననిపిస్తోంది. ఇంకా అయిదు నిముషాలుందిట టైము. ఎక్కడో తీతువుపిట్ట కూసినట్లనిపించి పక్కకి తిరిగి చూశాను. ఆమె చేతుల్లో పసిపిల్ల పీలకంఠంతో ఏడుస్తోంది. దగ్గుతో, ఏడుపుతో ఉక్కిరిబిక్కిరై విలవిల్లాడిపోతోంది. తల్లి చేతులు నెమ్మదిగా కుదుపుతూ ఊరుకోబెట్టటానికి ప్రయత్నిస్తోంది.

ఒక్కొక్క మనిషికి ఎన్ని కష్టాలు? ఎన్ని ఆవేదనలు? ఆమెని చూస్తుంటే అలవికాని బాధ నా మనసుని చుట్టేసింది. బస్సు కదలింది. నేను మళ్ళీ నా ఉపన్యాసం ఆలోచన మొదలుపెట్టాను. స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలు, ఆత్మహత్యలు, హత్యలు, అత్తగారి సాధింపులు, కట్నాల చావులు - భార్యల్ని హింసించే భర్తలు - అలా అలా -

నేను జాగ్రత్తగా, అపురూపంగా నీ చీర కుచ్చెళ్ళు నలగకుండి సర్దుకుని నా చూపులు మరల్చుకోబోయి ఆ తల్లి కళ్ళల్లోకి చూసి, వులిక్కిపడ్డాను. ఛెళ్ళున నన్ను ఎవరో కొట్టినట్లనిపించింది. ఆమె కళ్ళల్లో పల్చగా పరచుకున్న కన్నీటిపొర నన్ను కలచివేసింది.

ఇంతలో రోగిష్టి పసిపిల్ల భళ్ళున కుళాయి తిప్పినట్లు కక్కింది. నేను ఎంతో అపురూపంగా, మడత కూడా నలగకుండా కాపాడుకుంటున్న చీరనిండా కక్కేసింది. నేను "అయ్యో" అన్నాను అప్రయత్నంగా - ఆ పిల్ల విలవిల్లాడిపోతోంది ఊపిరి అందక. తల్లి కంగారుగా తన దగ్గరున్న మురికి తువ్వాలుతో నా చీరని శుభ్రం చెయ్యటానికి మొదలెట్టింది. భయంతో, అవమానంతో ఆమె కృంగిపోతున్నట్లని పించింది నాకు. పక్క సీట్లో వాళ్ళు తలో మాటా అన్నారు.

"అదేవిటమ్మాయ్ అలా కక్కించావు?"

"మరిన్ని పాత బట్టలు తెచ్చుకోవద్దా వెంబడి"

"అయినా అంత రోగిష్టి పిల్లతో ప్రయాణం చెయ్యకపోతేనేం?"

ఈ మాటలు విన్న ఆ తల్లి ముఖం చూస్తే నా మనసు విలవిలలాడిపోయింది. నాకేం చెయ్యాలో తోచలేదు, ఆమె నెమ్మదిగా అంది.

"దీనికి వారం దినాల్నుండి ఇట్టాగుందమ్మా. నిన్న డాట్టరు ఓ సూది మందిచ్చి, గుంటూరు తీసుకుపొమ్మన్నాడు - బతుకుద్దేమోనని తీసకపోతున్నా" అన్నది. 'ముందలగా డబ్బులేక మందు యిప్పించలేదు" అంది. ఈ మాటల వెనుక రెండు కన్నీటిబొట్లు రాలాయి. నా చీర తుడిచినా ఒక రకమైన దుర్గంధం ఆ పరిసరాలంతా వ్యాపించింది.

ఆమె ముఖం వైపు చూశాను. బొట్టు లేకపోవడాన్ని మొగుడు లేడనే స్ఫూర్తి నాకసహ్యం. మొగుళ్ళు వున్నా ఎంతోమంది బొట్టు పెట్టుకోరు. అర్ధ రూపాయంత బొట్టు పెట్టుకున్న ఆడదానికి మొగుడు వున్నాడన్న భరోసా ఏమీ లేదు. నిజానికి హిందూ స్త్రీకైనా మొగుడితో బొట్టు రాలేదు. అతనితో పోవాల్సిన పనీ లేదు. కానీ ఈ నిర్భాగ్యురాలు అంత బాధని, దైన్యాన్నీ, దారిద్ర్యాన్ని ఒక్కతే భరిస్తోంది. బాధ్యత స్వీకరించటానికి పురుషుడు సాధారణంగా దూరంగా వుంటాడన్నమాట నాకాక్షణం నిజమనిపించిందింది. అంతటి బాధలోనూ ఆమె ఒంటరిగా వుండడం నాకు భరించరానిదిగా అనిపించింది.

బస్సు వేగంగా ముందుకు సాగుతోంది - నా మనసులో ఊహించిన ఉపన్యాసం తునాతునకలైంది. ఊహలో జీవితానికి, నిజ జీవితంలో వచ్చే సమస్యల్ని ఎదుర్కోటానికి ఎంత భేదం? ఈ దారిద్ర్యం నుంచి, ఈ కష్టాల్నించి ఈ దీనుల్ని ఎవరు రక్షింపగలరు? అన్నిటికంటె కఠోరమైన శిక్ష దారిద్ర్యం. దరిద్రులు జీవితాల్ని

వదిలేసి ఎక్కడికని పారిపోగలరు? ఎవరు వారిని చేరదీయగలరు? ఆదుకోగలరు?

దయనీయమైన స్థితిలో వున్న ఆమెకి ఏ సాహిత్యం కావాలి? ఆమెని ఏ రచయిత చదవగలడు? ఆమె మానసిక వ్యథని ఏ రచయిత చిత్రించగలడు? చిత్రించి ఏం సాధించగలడు?

ఆమె కళ్ళు మూసుకుంది.. కళ్ళనుండి నీరు స్వేచ్ఛగా కారుతోంది. దగ్గి దగ్గి పిల్ల మెద వెనక్కి వాల్చి నిద్రపోతోంది. నా గుండెనెవరో రంపంతో కోస్తున్న బాధ.

మధ్యమెట్టు మీద కూర్చున్న మధ్య తరగతి వాడికి దరిద్రుడ్ని చూస్తే ఏవగింపు - పై మెట్టు మీద ధనికుడ్ని చూస్తే వ్యామోహం. ఈ భావన మారితే అంతా మహాత్మాగాంధీలే.

బస్సు గుంటూరు చేరింది. ఆమె నావంక జాలిగా, అపరాధిలా చూసి, ఎడం చేతి మీద పిల్లని, కుడిచేత్తో చిన్న బుట్టని పట్టుకుని కిందకి దిగింది - రెండు అడుగులు వేసి "అమ్మా! గవర్నమెంటు అస్పటాలికెల్లాలంటే ఏ బస్సెక్కాల?" అంది-

నా పర్సులో చెయ్యి పెట్టాను. నోటు తగిలింది - అది తీశాను.

"బస్సులో వద్దు. రిక్షాలో వెళ్ళు" అంటూ ముందుకు కదిలాను. ఆమె వెనుక నుంచి ఏదో చెప్పబోయిందని నేనూహించాను. నాకు తెలుసు - కృతజ్ఞత. అది నేను భరించలేను.

సాహిత్యంలో స్త్రీ గురించిన ఉపన్యాసం గాలిలోకి ఎగిరిపోయింది. బస్సులో నా పక్కన కూర్చున్న స్త్రీ బొమ్మ నా కళ్ళల్లోంచి కదలకుండా తిష్ట వేసుక్కూర్చుంది.

రిక్షా ఎక్కేశాను సుజాత యింటికెళ్ళి చీర మార్చుకుని సభకి వెళ్దామని-